కమలాదేవికి నివాళి

దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



కమలాదేవి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

బొల్లారం: కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ ప్యారసాని గౌరీశంకర్ సతీమణి కమలాదేవి దశదిన కర్మ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నాట్య గురువు ఉషశ్రీతో చిన్నారులు

లాలాపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నాట్యవేద మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. నాట్యగురువు ఉషశ్రీ, సంగీత గురువు రాజేశ్వరీల నేతృత్వంలో ఈ సందర్భంగా చిన్నారులైన కళాకారులు భరతనాట్యం, భాగవత పద్యాలు, రాధా కృష్ణుల వేషధారణలో పాటలు వంటి పలు కళారూపాలను ప్రదర్శించారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం మగ్దూం భవనంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సందర్శించి నివాళులర్పించారు. నిత్యం ప్రజల సమస్యలపై పోరాడిన సురవరం సుధాకర్‌రెడ్డి నేటి రాజకీయ పార్టీల నాయకులకు ఆదర్శమన్నారు.

అభినవనగర్ కాలనీ అధ్యక్షుడిగా చంద్రపాల్‌రెడ్డి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ అభినవనగర్ కాలనీ అధ్యక్షుడిగా చంద్రపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో అభినవనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రపాల్‌రెడ్డిని అధ్యక్షుడిగా, కార్యదర్శిగా నర్సింహరెడ్డి ఎంపికయ్యారు.

కొత్త హాస్టల్ భవనానికి దుందుభి నామకరణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండటంతో ప్రారంభంకానున్న కొత్త హాస్టల్ భవనానికి దుందుభి అని పేరుపెట్టారు. దీంతో క్యాంపస్‌లో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థినీ, విద్యార్థుల హాస్టల్స్ సంఖ్య సుమారు 25కు చేరుకుంది. ఇవి కాకుండా సికింద్రాబాద్ పీజీ కాలేజీ, నిజాం కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీలతో పాటు జిల్లా పీజీ సెంటర్లలో విద్యార్థుల వసతి కోసం మొత్తం 30 హాస్టల్స్ ఉన్నట్లు సమాచారం.

ఓయూలో స్వాగత తోరణాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా విద్యార్థి నాయకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్ అంతట స్వాగత తోరణాలతో ముంచెత్తారు. 108 ఏళ్ల చరిత్ర గల ఓయూకు సీఎం రావడాన్ని స్వాగతిస్తున్నామని మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్‌రావు పేర్కొన్నారు. ఓయూకు రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాకను అడ్డుకుంటే సహించేదిలేదని ఓయూ జేఏసీ అధ్యక్షులు బైరు నాగరాజుగౌడ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సలహా కమిటీలో ఐలయ్యకు చోటు

లాలాపేట: కాంగ్రెస్ నూతనంగా ఏర్పాటు చేసిన ఓబీసీ సైద్ధాంతిక సలహా కమిటీలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య షపర్డ్‌కు చోటు లభించింది. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఓబీసీ ఐడియాలజికల్ అడ్వయిజరీ కమిటీ నేషనల్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ సుధాన్షు కుమార్‌తో పాటు దేశ వ్యాప్తంగా 23 మంది మేధావులతో కీలక కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో ప్రొ. కంచ ఐలయ్య షపర్డు కమిటీలో 23 మంది మేధావుల్లో తెలంగాణ నుంచి నియమితులయ్యారు. ఓబీసీ రిజర్వేషన్లు, హక్కులు తదితర అంశాలపై ఈ కమిటీ పని చేయనుంది.

లాల్ బజార్ ఆలయం బస్టాప్ వద్ద



హోలీ ఫ్యామిలీ చర్చి వద్ద..



రోడ్డుపై ప్రమాదకర గుంతలు

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని తిరుమలగిరి మెయిన్ రోడ్ పరిస్థితి అధ్వానంగా మారింది. లోతుకుంట బ్రిడ్జి దిగువన, లాల్ బజార్ ఆలయం బస్టాప్, తిరుమలగిరి చౌరస్తా పరిసర ప్రాంతాల్లో రహదారిపై పలు చోట్ల లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిలో రోజుకు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో రాత్రి వేళ గుంతలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల బైకులు, ఆటోలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలువురు వాహనదారులు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. వర్షాలు మరింత తీవ్రమైతే, ఈ రహదారిపై ప్రయాణం మరింత ప్రాణాపాయంగా మారే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి, రహదారి మరమ్మతులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



లోతుకుంట బ్రిడ్జి దిగువన గుంతలు

బొల్లారంలో ఛిద్రమైన రహదారులు

- పట్టించుకోని అధికారులు
- ప్రజలే గుంతలను పూడుస్తున్న వైనం!



బొల్లారం ప్రాంతంలో గుంతలు పూడ్చుతున్న స్థానికులు

బొల్లారం: రోడ్లపై గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చివరకు ప్రజలే తమ సొంత ఖర్చుతో గుంతలను పూడ్చారు. బొల్లారం బజార్ రైల్వేస్టేషన్, సదర్ బజార్ సమీపంలోని టీబీటీ బ్లాక్స్ (న్యూబ్లాక్స్) వద్ద రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్లపై గుంతలు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు తమ సొంత ఖర్చుతో గుంతలు పూడ్చారు. డౌన్‌టౌన్ బజార్ భూలక్ష్మమ్మ ఆలయం నుంచి ప్రారంభమయ్యే రహదారి కూడా దుర్దశకు గురైంది. ఇక్కడ కూడా స్థానికులు తమ డబ్బులతో రోడ్లపై ఉన్న గుంతలను మూసివేశారు. స్థానిక నేత జీ.వీ. బాలరాజ్, నరసింహన్ కన్నన్, జి.అర్వింద్ మాట్లాడుతూ.. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



డౌన్‌టౌన్ బజార్ ప్రాంతంలో గుంతలు పూడ్చుతున్న స్థానికులు

మౌలిక వసతులే అభివృద్ధికి పునాది

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం: మౌలిక వసతులే అభివృద్ధికి పునాది అని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయ్యడమే తన లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం 7వ వార్డు, ఓల్డ్ గాం, దీనగర్‌లోని సెయింట్ ఆంథోనీ చర్చ్ సమీపంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో బోర్‌వెల్ తవ్వకం పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, రవీందర్ గుప్తా, రేమండ్, భవాని, ప్రదీప్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఓయూలో నేతల ముందస్తు అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి రాకను అడ్డుకుంటామని బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రకటించడంతో పలువురు విద్యార్థి నేతలను పోలీసులు ఆదివారం నుంచే ముందస్తుగా అరెస్ట్ చేశారు. యూనివర్సిటీ లైబ్రరీలో ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, డీఎస్సీ, ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు నాగారం ప్రశాంత్ విద్యార్థులతో లేఖ రాయిస్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ప్రశాంత్‌తో పాటు వేల్పుకొండ రామకృష్ణ, సంతోష్‌లను అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

‘ఆగమనం’ అదరహో

- ఎర్రగడ్డ ప్రధాన రహదారిలో విక్రయాల జోరు
- అంతటా ఆధ్యాత్మిక వాతావరణం





ఎర్రగడ్డ–ఈఎస్‌ఐ రహదారిలో విక్రయాలకు ఉంచిన వినాయక విగ్రహాలు

సనత్‌నగర్: నియోజకవర్గంలో చవితి సందడి రెండు రోజుల ముందు నుంచే ప్రారంభమైంది. వాడవాడలా బొజ్జగణపయ్యను ప్రతిష్ఠించేందుకు మండపాలు సిద్ధమవుతున్నాయి. కొన్ని మండపాల్లో గణనాథుడి ఆగమనం కూడా జరిగింది. ఏటా వైభవంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వినాయక ప్రతిమలను విక్రయించే కళాకారులు, వ్యాపారులతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. వినాయక విగ్రహాలను తయారుచేయడంలో సిద్ధహస్తులైన ధూల్‌పేట కళాకారులతో పాటు రాజస్థాన్‌కు చెందిన కలాకారులు తాము తయారు చేసిన విగ్రహాలను ఎర్రగడ్డ–ఈఎస్‌ఐ ప్రధాన రహదారిలో అమ్మకానికి పెట్టారు. దాదాపు అరకిలోమీటరు పొడవునా చిన్నా పెద్దా విగ్రహాల విక్రయాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రూ.100ల నుంచి మొదలుకొని రూ.లక్షన్నర వరకు ధర పలుకుతున్న విగ్రహాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. విభిన్న ఆకృతుల్లో రూపుదిద్దుకున్న విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ముందుగానే ఉత్సవ కమిటీ నిర్వాహకులు బుక్ చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే చాలావరకు విగ్రహాలు బుక్ చేసుకొని వినాయక చవితికి ఒక రోజు ముందు మండపాలకు తీసుకువెళ్లేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

ఎల్లమ్మ ఆలయ కార్యనిర్వహణ అధికారిగా తమ్మినేని శేఖర్



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కార్యనిర్వహణ అధికారిగా తమ్మినేని శేఖర్‌ను నియమించారు. హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న తమ్మినేని శేఖర్‌ను ఇన్‌చార్జి ఈఓగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ ఆలయానికి రెండేళ్లుగా పూర్తిస్థాయి ఈఓను నియమించక పోవడం గమనార్హం.

సుధారాణికి డాక్టరేట్



ఉస్మానియాయూనివర్సిటీ: పీహెచ్‌డీ డాక్టరేట్ కల సాకరమైందని ఓయూ సైన్స్ కాలేజీ విద్యార్థినీ కె.సుధారాణి పేర్కొంది. ఓయూ అధ్యా పకురాలు ప్రొ.రోజారాణి పర్యవేక్షణలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్‌ట్రాక్ట్ ఫర్ యాంటి ఎపిలెప్సీ యాక్టివిటీ ఆఫ్ ఆకలిఫా ఇండియా అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. తన పరిశోధనలకు సహరించిన కుటుంబ సభ్యులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దు

అడ్డగుట్ట: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా కావొద్దని లాలాగూడ ఎస్‌ఐ అమర్‌సింగ్ సూచించారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా ఆదివారం సౌత్ లాలాగూడలోని గ్రౌండ్‌లో యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సమాజంలో యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై దృష్టి సారించాలన్నారు. అదే విధంగా నేరాల నియంత్రణకు బస్తీలు, కాలనీల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింక్‌లను ఓపెన్ చెయ్యకూడదని సూచించారు.



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న లాలాగూడ ఎస్‌ఐ అమర్ సింగ్

ఘనంగా మర్రి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సనత్‌నగర్: మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సాయంత్రం బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన బీజేపీ శ్రేణుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు.

శరత్‌బాబుకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి రక్కి శరత్‌బాబు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ)లో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన రక్కి దేవదాస్, భారతీ దంపతుల కుమారుడైన శరత్‌బాబు జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారని పేర్కొన్నారు. ఓయూ అధ్యాపకురాలు ప్రొ.రాధిక పర్యవేక్షణలో ‘స్వార్మ్ ఆప్టిమైజ్డ్ రాండమ్ ఫారెస్ట్ అండ్ సీఎన్ఎన్–ఎల్ ఎస్టీమ్’తో హనీపాట్ సాంకేతికతను ఉపయోగించి నెట్‌వర్క్ భద్రతకు సమగ్ర దృక్పథం అనే అశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందున్నట్లు తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన ఓయూ, జేఎన్‌టీయూ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

సనత్‌నగర్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో జెక్‌కాలనీ వాసవి కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఎస్‌వీఎస్ఎస్ అధ్యక్షుడు సోమ వెంకట్ ఆధ్వర్యంలో దాదాపు 300 మందికి మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు, శివారెడ్డి, విశ్వనాథరాజు, అనంతరెడ్డి తదితరులు హాజరయ్యారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులను కాలుష్యం బారిన పడకుండా ఉంటాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాలనీవాసులు మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని కోరారు.



జెక్‌కాలనీలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చిట్టి చేతులతో బొజ్జ గణపయ్య



మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసిన చిన్నారులు

సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సనత్‌నగర్ మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. మోడల్‌కాలనీతో పాటు సమీప సుందర్‌నగర్, ఆదిత్యనగర్, ఉదయ్‌నగర్, సనత్‌నగర్, జెక్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి దాదాపు 100 చిన్నారులు పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను తయారుచేశారు. నిర్వాహకులు మట్టిని సమకూర్చగా, అలంకరణ సమాగ్రితో వచ్చిన చిన్నారులు లంబోదరుడి ప్రతిమలను తయారుచేయడమే కాకుండా అందంగా అలంకరించారు. 100 మంది వరకు చిన్నారులు పోటీపడగా సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి బహుమతులు అందజేశారు. అలాగే మిగతా వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ పర్యావరణ స్పృహ కలిగించాలనే ఉద్దేశ్యంతో మట్టి విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించామని, చిన్నారుల నుంచి విశేష స్పందన వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, సుబ్రహ్మణ్యం, నరేంద్రకుమార్, లక్ష్మీనరసింహారెడ్డి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ హేమకు సత్కారం



కార్పొరేటర్ హేమను సత్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమను తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. తెలంగాణ ఐటీ హబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసిన సామల హేమ కొద్దిరోజుల క్రితం జరిగిన ఓయూ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ అందుకున్నారు. ఈ సందర్భంగా మహాసభ ప్రతినిధులు మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజికవర్గం నుంచి చిన్నతనంలోనే రెండు మార్లు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా గెలుపొందడంతో పాటు ఉన్నత విద్యలు అభ్యసించి డాక్టరేట్ సాధించడం తమకు గర్వంగా ఉందన్నారు. ముదిరాజ్ యువతీయువకులకు ఆదర్శంగా నిలిచిన సామల హేమ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు యాదగిరి, గౌరీగణేశ్, శ్రీనివాస్, చిరంజీవి, చందర్, వీరస్వామి, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెహలే ప్రకాష్ పురబ్ ఉత్సవాలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గురుద్వార కమిటీ, సిక్కుల ఆధ్వర్యంలో ఆదివారం పెహలే ప్రకాష్ పురబ్ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుద్వారలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బాయ్ గజ్‌ప్రీత్ సింగ్ జీ ఖన్నా ఆధ్వర్యంలో ఆత్మీయ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఆనందంలో పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా సాహెబ్ సికింద్రాబాద్ ప్రబంధక్ కమిటీ అధ్యక్షులు బల్దేవ్‌సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌సింగ్, ఉపాధ్యక్షుడు సురేందర్ పాల్‌సింగ్, కార్యదర్శి హర్ప్రీత్‌సింగ్ గులాటి, సంయుక్త కార్యదర్శి తరన్‌దీప్ సింగ్ భాటియాతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి పెద్ద ఎత్తున సిక్కులు పాల్గొన్నారు.

రజకులకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు

లాలాపేట: రజకులకు భద్రతకు రక్షణ చట్టంతో పాటు 50 ఏళ్ల నిండిన రజకులకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతిఉపేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం తార్నాకలోని దోభీఘాట్‌లో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి ప్రభాకర్ అధ్యక్షతన రజక వృత్తిదారుల తార్నాక డివిజన్ కమిటీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులను కేవలం రజకులతోనే వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీలను చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్రూం ఇళ్లలో రజకులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. దోభీఘాట్‌లకు రజకులకు ఇస్తున్న ఉచిత విద్యుత్ ఎల్‌టీ 2 నుంచి ఎల్‌టీ 4కు మార్చాలని కోరారు. ప్రమాద బీమా రూ. 5 లక్షలు ప్రభుత్వం అందించాలన్నారు. వ్యక్తిగత రుణాలు రూ. 10 లక్షలు, సొసైటీ రుణాలు రూ. 30 లక్షల వరకు ఇవ్వాలన్నారు. సంఘం మాజీ నగర కార్యదర్శి అశోక్, సీఐటీయూ నగర నాయకులు అజయ్‌బాబు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా నాయకులు సర్దార్ అశోక్, జ్యోతి దుర్గయ్య, రజక సేవా సంఘం అధ్యక్షులు జి. రమేశ్, వి. మైసయ్య, సాలయ్య, హనుమంతు, తిరుపతి, పొన్న రాజు, యామంకి రవి, పోతరాజు గోపి, రాములు, సురేష్, రాజయ్య పాల్గొన్నారు.